# ముత్తడు గొపోడు

ఎడం కాలిని ఎత్తగలిగినంత పైకెత్తి ఎగిరి ఒక్క తన్ను తన్నాడు పరదేసిరెడ్డి!

మూడు పొల్లికలు పొల్లి ... మూడు బార్ల కవతల ఎత్తి కుదేసినట్లు పడి... ముక్కుతూ మూలుగుతూ పైకి లేచి... లేప లేక తలను పైకి లేపి... తిప్ప లేక చూపును ప్రక్కకు తిప్పి... చూడ లేక చూశాడు ముత్తడు - పరదేశిరెడ్డి ప్రక్కన ఠీవిగా నిలబడి ఉండే సూటూ బూటూ దొరబాబును!-

ఆ చూపుల్లో....

"నేనేం తప్పుచేసినానయ్యా?" అన్న ప్రశ్న ఉంది.

"తన్నినా తగలేసినా ఈ దిక్కుమాల్నోడు ఏంజెయ్యబోతాడయ్యా?" అన్న నిస్సహాయత ఉంది.

"అయ్య పక్కన నిలబడుకోని అట్టా ఉలికీ పలక్కుండా చూస్తా ఉండావే! - ఇది నీకు నాయమా చెప్పు?" అన్న అభ్యర్థన ఉంది.

పరదేశి రెడ్డికి ఇంతదూరం సావకాశంగా ఆలోచించే ఓపిక ఎక్కడుంది? విడిచిపెట్టిన ఆంబోతులా రెచ్చిపోతూ నిప్పులు కక్కుతున్నాడు.

అందుకే ముత్తడి చూపుల్లో ప్రశ్న, అభ్యర్థన నిస్సహాయంగా చేతులు కలిపి పరదేశిరెడ్డి కక్కుతున్న నిప్పుల్లో ఆత్మాహుతి చేసుకొన్నాయి.!

సూటూ బూటూ దొర చూపుల్లో నిర్లక్ష్యం అదే తన లక్ష్యమన్నట్లుగా ముత్తడి ఎదను సూటిగా తాకింది. ముత్తడు తలవంచాడు. ఆ తలలో ఎక్కడున్నాయో? ఏమో? వాన చినుకులు మాదిరి కురుస్తున్నాయి కన్నీళ్ళు!

ఆకన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి!

పరదేశిరెడ్డి కక్కిన నిప్పులు పొగలు కక్కుతూనే ఉన్నాయి!!

పొద్దు నడిమిట్టన ఉంది. ఆ మండేవాడు కూడా 'భగభగ' మండుతున్నాడు.

మరొకచోట మరొకచోట అయితే ముత్తడు చేతులు మోడ్చి తలపైకెత్తి "అంతా ఆ మండేవాడు చూసుకుంటాళ్ళే?" అనేవాడు. ఇప్పుడు అలా అనడానికి గుండెల్లేవు. ఎలా ఉంటాయి? ఎడంకాలి తన్నుతో ఎప్పుడో ఎగిరిపోతే?...

ఆ ఇంటి తాళవారంలో అబ్బ పరదేశిరెడ్డి. కొడుకు గాంధీరెడ్డి. సేద్యగాడు ముత్తడు. ముగ్గురు మూడు దిక్కుల్లో నిలబడి ఉన్నారు. ఆ ఇంటి ఇల్లాలు పద్మావతమ్మ హాల్లో ద్వారబంధానికి అనుకొని కొరకొరా చూస్తూఉంది. తాళవారం ముందు కొట్టంలో గాట గొడ్లు... ముత్తడి చేతుల్లో ముదిగారంగా పెరిగిన గొడ్లు మేపు తినడం మాని మోరలు ముందుకు చాపి గుంజులాడ్తూ ఉన్నాయి.

"ఇంకా ఎందుకురా నిలబడుకోనుండావే? చెప్పరా నాకొడకా చెప్పు. చాల్లేదా చెప్పరా?" ఎకసెక్కెం ఎగిరెగిరి పడ్తూ ఉంది పరదేశిరెడ్డి మాటల్లో!

"పేదవాడి కోపం పెదాలకు చేటు. ఇది నాకు తెలవకుండా పోలేదు. అయినా నేనూ మణిసినే! మణిసి అనేవాడికి అంతో ఇంతో చీమూ నెత్తురూ ఉండనే ఉంటింది. చీమూ నెత్తురుంటే అబిమానమూ ఉంటింది." ముత్తడి గుండెల్లో బాధ మాటలుగా మారలేక కండ్లల్లో కరిగిపోతా ఉంటే -

వాడి తల పైకి లేచింది.

"ఏందిరా అట్ట చూస్తా ఉండావే? ఎట్ట చూసినా ఒక ఎంటిక కూడా పెరుక్కోలేవ్. పోరా! పో. తిరిగి మల్లి చూడకుండా పో. పాయ్ నీ వల్ల అయ్యింది..."

పంచన కుక్క 'కుయ్యో! కయ్యో' అని అరుస్తూ పరదేసిరెడ్డి మాటలకు ముక్తాయింపు పలికింది.

"చీచీ! నోర్ముయ్యే!" పరదేశిరెడ్డి కసిరాడు.

అది తోకాడిస్తూ నోరుమూసింది. ఎందుకంటే - 'కుక్క విశ్వాసము గల జంతువు' అని నిరూపించడానికి.

ముత్తడు నోరెత్తలేదు! అయితే పంచన కుక్క మాత్రం?...

ఆ కుక్కను ప్రతి నిత్యం ఊరి ముందరి చెరువులో ఈతాడించేవాడు. సబ్బుతో కడిగేవాడు. వింటిల్లబ్బ చేతబట్టి ఒక గోరింకనో, బెళ్లగువ్వనో గురిచూసి కొట్టేవాడు. పడిన గువ్వను బొచ్చు పెరికి కాల్చి పక్వం చేసి దాని నోటికి అందించేవాడు. వాడంటే ఆ కుక్కకు పంచప్రాణాలు. అందుకే అది పెరుకులాడ్తూ ఉంది. బెరుకు బెరుగ్గా చూస్తూ... చూస్తూ అరవలేక... అరవకుండా ఉండలేక అల్లాడిపోతూ ఉంది. దాని అవస్థను గమనించాడు ముత్తడు. చూడలేక తలవంచాడు. చూపును ఎద్దుగొడ్లవైపుకు మళ్ళించాడు.

గాట్లో నోరులేని గొడ్లు! గాటి నిండా మేపు. అయినా అవి పోస ముట్టకుండా గుంజులాడ్తున్నాయి.

"అవును. నేను తిన్నా తినకుండా పొయ్‌నా ఆ గొడ్లను సెణం యామార్లేదే?... కరువురానీ కాటకం రానీ బిడ్డల్ని సాకినట్టు సాకినా. నా గుండెకాయిని మణుసులు గుర్తించకుండా పొయ్‌నా గొడ్లు గుర్తిస్తుండాయి!"

ముత్తడి తల వాలిపోయింది!-

తల వాలిపోతే కాళ్లకింద ఏముంది?... భూదేవి!

"ఈ బూదేవిని నమ్ముకుణ్ణా! నన్ను పర్దేసిరెడ్డి నమ్ముకుణ్ణాడు. రేత్రనక పొగులనక వంచిన నడుం ఎత్తకుండా పోరకలాణ్ణాను. ఈ ఇంటి నాలుగుగోడల మద్దె తప్పిస్తే నా చెమటతో తడవని చోటు ఎతికినా కనిపిస్తిందా?"

ఈ మాట మనసులో మెదిలేసరికి ముత్తడి మనసు ఎట్టెట్టో పోయింది. గబాలున నేలమీదికి వంగాడు. వంగి పుడమి తల్లిని మూడు సార్లు కండ్లకద్దుకున్నాడు. అద్దుకొని పైకి లేచాడు. లేచి గిరుక్కుమని వెనక్కు తిరిగాడు. పుట్టి బుద్ధెరిగిన నాటినుండి ఆయింటితో అనుబంధం. అది ఆక్షణంలో తెగిపోతూ ఉంది. తన్నులు తిన్న బాధకంటే ఈ బాధ... నరనరానికి ఎక్కి నవనాడులు కుంగదీసింది. తలవాలిపోయింది.

వంచిన తలెత్తకుండా అడుగుమీద అడుగ్గా ముందుకు నడిచాడు.

ఆ ఇంటి గడప దాట్తున్నాడు ముత్తడు. గడపకు అవతల ఒక కాలు. ఇవతల ఒకకాలు. కదలీ మెదలకుండా అలానే నిలబడ్డాడు. నిలబడి ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు!

అబ్బ పరదేసిరెడ్డి కొడుకు గాంధీరెడ్డి తనవైపే చూస్తున్నారు - ఏదో సాధించామన్న విజయగర్వంతో!-

ముత్తడు రెండు చేతులు పైకెత్తి జోడించి ఒక్క దండం పెట్టాడు. అంతటితో ఆ ఇంటితో ఋణం తీరిపోయినట్లుగా!- అంతే! ఒక్క విసురుతో వెనక్కి తిరిగాడు. ఆ ఊపు మీదనే ముందుకు నడుస్తున్నాడు. ఏదో జరగరాని అన్యాయం జరిగిపోయినట్లుగా కట్టుగూటాన గొడ్లు గుంజులాడుతూ 'అంబా! అంబా!' అని అరుస్తున్నాయి. పంచమీద కుక్క ఏడవలేక ఏడవకుండా ఉండలేక ఏడుపును అదొక రకం మూలుగ్గా మార్చి కట్టేసిన గొలుసును కసి కసిగా కొరుకుతూ ఉంది.

నలగని ఖద్దరు పై పంచె మడతల్ని నాజూగ్గా సర్దుకుంటూ పరదేశిరెడ్డి... నేలమీద రాసి రాసి బూటు కొన అరిగిపోయిందేమో అని తడిమిచూసుకుంటూ గాంధీరెడ్డి... నవ్విన నవ్వుకు అల్ప స్వల్పమైన ఇల్లయితే పైకప్పు ఎగిరిపోయేదేమో? -

అయితే నోర్లేని గొడ్ల గుండెల్లో నుండి కన్నుల్లోకి ఎగదన్నిన పాశం కన్నీళ్లుగా మారి మూతి మీదుగా జారి కసువుపోసలమీద పడి అభిమానానికి ఆనవాలై ఇంకిపోతున్నాయి.

ఊరికి ఉత్తరంగా నాగులమిట్ట బావి. ఆ బావి గట్టున ఒక కానుగ చెట్టు. ఆ చెట్టు కింద కుప్పగా కూలబడ్డాడు ముత్తడు. కూలబడి కల మాదిరి జరిగిపోయిన జీవితం కండ్లముందు కదలాడుతుంటే రెప్పార్చకుండా చూస్తున్నాడు ముత్తడు!...

పరదేసిరెడ్డి!

ఆ పాయకట్లో జనాలకు తల్లో నాలుక!...మొల్లోరూక!!

కనుచూపు దూరంలో కనిపిస్తే వాడు ఎటువంటి మొగలాయి అయినా సరే! రెండు చేతులు జోడించాల్సిందే!...ఒక వేళ కూర్చొని ఉంటే చివాలున లేచి చేతులెత్తి నమస్కరించి మళ్లీ అదే చేతుల్ని నలుపుకొంటూ నిలబడాల్సిందే!!

భయంతో కాదు!...భక్తితో.

ఈ భయ భక్తులు తెకతేరకు రాలేదు పరదేసిరెడ్డికి.

పరదేసిరెడ్డి తాత ముత్తాతలకు అంతో ఇంతో కయ్యాకాలవ ఉండింది. ఉన్నదాన్ని ఉన్నట్లే కాకుండా ఎంతో కొంత పెంచి ఆ ఆస్తిని వాళ్లు పరదేసిరెడ్డి పరంచేశారు. పరదేసిరెడ్డి ఆస్తిపాస్థులతో పాటు అతి జాగ్రత్తగా అంతో ఇంతో తెలివితేటల్ని కూడేసుకున్నాడు! అది ఎలా సాధ్యపడిందంటే?

పరదేసిరెడ్డి పెద్ద పెద్ద చదువులు చదవలేదు. వీధిబడి చదువుతోనే అతడి బ్రతుకు బరువుబాధ్యతల మధ్య వదులుకోలేని బంధమై ఇరుక్కొని పోయింది. అయినా పరదేసిరెడ్డి పెద్దబాలశిక్ష చేత పట్టుకొన్నాడు పాపం! చదువులేని మొద్దు కదలలేని ఎద్దు అన్న సామెత మనసులో మెదిలే సరికి. పెద్ద బాలశిక్షనే ఈ కడనుండి ఆ కడవరకు తిప్పించి మళ్లించి చదివేసరికి పెద్ద పెద్ద పుస్తకాలనే తడుముకోకుండా చదవడానికి తయారయ్యాడు. అలా తయారై ఆయన తెలుసుకొన్న సత్యమేమిటంటే? ఈ నాగరిక లోకంలో నోకం తెలియకపోతే బతకలేమని!

అయితే అది చాలా ఎత్తులో ఉంది. దాన్ని చేరుకోవాలంటే చాలా చాలా మెట్లెక్కాలి! ఎలా ఎక్కాలి అని చాలా తీవ్రంగా ఆలోచించి.... ఆలోచించి -

ఖద్దరు గుడ్డలు కట్టి పరదేసిరెడ్డి మొదటిమెట్టు ఎక్కేశాడు! ఆ మెట్టుమీద నిలబడి "అని కుదిరితే పని సులభమంటారు పెద్దోళ్లు. ఖద్దరు గుడ్డల్తో అని కుదిరింది. ఇంకేం ఫరవాలేదు." అని తెంపుగా తెపరాయించాడు.

మహాత్మాగాంధీని మతోన్మాది గాడ్సే హత్యచేశాడు. అబాల గోపాలం కన్నీరు మున్నీరుగా విలపించింది. ఇంత గొప్ప అవకాశాన్ని జారవిడుచుకునే అసమర్థుడు కాదు పరదేసిరెడ్డి. ఊళ్లో భజన గుడిలో రాముడి పటం ప్రక్కన గాంధీ పటాన్ని పెట్టించాడు. వరసగా వారం దినాలు ఆయన ఆత్మకథను చదివి వినిపించాడు. విన్నవాళ్ళు ఏడుస్తూ ఉంటే వాళ్లతో కలిసి తానూ ఏడ్చాడు!

ఆ తరువాత తనకు కొడుకు పుట్టే వాడికి గాంధీరెడ్డి అని పేరు పెట్టుకున్నాడు.

నెహ్రూ మరణ వార్త విని నెలరోజులు మౌనవ్రతం పాటించాడు.

అప్పుడు దేశంలో ఏనోట విందామన్నా ఒకటేమాట! ఎక్కడ ఏ సభ జరిగినా అదే మాట! 'మాలను కూడా మనిషిగా చూడండి!' అని.

ఈ దెబ్బతో చాలా మెట్లు పైకెక్కి పోవచ్చని సంబరపడ్డాడు రెడ్డిగారు!

జీవితానుభవం పరదేసిరెడ్డికి 'ఆలస్యం అమృతం విషమ్' అన్న పాఠాన్ని నేర్పింది. అందుకే వెంటనే మాలవాడమీద పడ్డాడు. కాలికి బలపం కట్టుకున్నట్టుగా ఇల్లిల్లు తిరిగాడు.

ఇంటికొక్క మనిషిని వాడముందు గెవిన్లో మామిడి చెట్టు కింద చేరమన్నాడు.

కాకితో కబురంపితే ఇంటికొక్క మనిషికాదు-ఇల్లిల్లు కదిలి వస్తుందని పరదేసిరెడ్డికి తెలుసు. అయితే ఆమాత్రం నోకం తెలియని అమాయకుడేం కాదు. అందుకే చెట్టుకింద చేరిన వాళ్లందరిని పేరు పేరునా పలకరించాడు. ఆ పలకరింపుతో వెర్రి గుంపు తాగినోళ్ల మాదిర వెనక్కు ముందుకు ఊగిపోతుంటే ఆ ఊపును గ్రహించిన రెడ్డి అందుకొన్నాడు.

"ఒరే నాయనలారా! తినేదానికి కడుపుకు కూడు లేకుండాపోతే ఆకులూ అలమలు పెరక్కతిని నాలుగు దినాలు పాణాలు నిలబెట్టుకోని తిరగచ్చు. అదే గొంతులోకి గుక్కెడు నీళ్లు లేకుండా పోతే?...ఆహాఁ! మీ ఆడోళ్లు చంకల్లో కడవలేసుకోని ఆ గుక్కడు నీళ్ల కోసరం గెనిమలమింద పడతాలేస్తా మోటబావులచుట్టూ తిరగతాఉంటే కడుపట్నే తరక్కపోతింది. ఆ ఆడవి పాపం! గుక్కెడు నీళ్ల కోసరం ఎన్నెన్ని తిప్పలు పడతా ఉండారో? ఎంతెంత దూరం నడస్తా ఉండారో? ఎప్పుడైనా మీరు ఆలోచించినారా?...చెప్పండ్రా చెప్పండి."

చెప్పలేక ఏమి చెప్పాలో తెలియక చేతులు పిసుక్కుంటూ మళ్లీ ఆ చేతులతోనే వొంగి వొంగి దండాలు పెట్టిందా గుంపు.

"అడిగితే అంతే! అరీగురీ మనకుండా రాతికూసాల మాదిరి నిలబడతారు. గదమాయిస్తే చేతులు పిసుక్కుంటారు. ఎట్రా మీతో ఏగులాడేది? చెప్తే వినరు. పోనీ మీఅంతట మీరైనా తెలుసుకుంటారా అంటే? అదీలేదు. అందుకే పెనుమూరు పిచ్చయ్యశాస్త్రులు దగ్గర లగ్నం పెట్టించినా. వారం, తిథి, నక్షత్రం-అన్నీ బెమ్మాండంగా కుదిరినాయి. మీరు ఇంటికొక మనిషి పార గెడ్డపార చేత పట్టండి. మిగిలిన పని నాకొదిలి పెట్టండి."

"పర్దేసిరెడ్డికి జై!" అనింది అక్కడ చేరిన మాలగుంపు!

దినమూ ఒక రాయిని తీస్తాఉంటే అది ఎంత పెద్ద కొండైనా కరిగిపోతింది. తలా ఒక చెయ్యేస్తే? చేదబావి ఒక లెక్కా?" ఈ సత్యాన్ని అనుభవంతో గ్రహించిన పరదేసిరెడ్డి అతి చాకచక్యంగా తీగను కదిలించాడు. డొంకంతా కదిలింది!

వారాలు తిరగకముందే వాడముందు ఒక చేదబావి వెలిసింది!

అప్పుడు పరదేసిరెడ్డి వాడనుండే ఒక చేదదారం, బక్కెట్ తెప్పించాడు. తానే స్వయంగా నీళ్లు చేదాడు. ఒక దోసెడు నీళ్లెత్తి గొంతులో పోసుకుణ్ణాడు.

"ఆహాహా! లగ్న బలమంటే ఏమనుకున్నార్రా? నాలుగైదు మట్లు లోతులోనే నీళ్లు. నీళ్లా యివి?...గోయిందు వొడ్డుకాడ టెంకాయితోపులో పక్వానికొచ్చిన టెంకాయ నీళ్లు

గదరా?" అన్నాడు.

"పర్దేసిరెడ్డికి జై! పర్దేసిరెడ్డికిజై"! అనిందా గుంపు.

తిత్తిలో రూక బుడిగలో ఆముదం సెలవు కాకుండా తొట్టి బిడ్డను పెంచడంలో పరదేసిరెడ్డికి పరదేసిరెడ్డే సాటి. చేతికి మట్టికాని ఈ పద్ధతి రెడ్డి గారికి బాగా అచ్చి వచ్చింది. అందుకే చాలా చాలా మంచి పనులు చేసి ఆ పాయకట్లో చాలా ఎత్తుకి ఎదిగిపోయాడు!

ఇప్పుడు పరదేసిరెడ్డి ఆ పాయకట్టుకే తలకట్టు!

అందుకే ముత్తడి అయ్య ముకుందడు పోతూ పోతూ అదేమాట చెప్పిపోయాడు.

"ఒరే అబ్బోడా! నా చీటీ ఎట్టా చెల్లుబడింది. చెల్లుబడితే చీటీ చింపెయ్యాల్సిందే! చింపేసినారు. నేను పోతా ఉండా. పోతా పోతా ఒక్క మాట చెప్పి పోతా. మర్సిపోబాక. మా తాత ఈ పంచన్నే బతికినాడు. మీ తాత గూడా అంతే. తాత ముత్తాతల కాలం నుంచి ఈ పంచనే నమ్ముకున్నాం. పెట్టింది తిన్నాం. పోసింది తాగినాం. ముక్కునొచ్చిందని మూతి నొచ్చిందని కుంటి సాకులు చెప్పి పాలుమారి కూసోకుండా వొళ్లొంచి పనిచేసినాం. అటుమంటి జల్మాలు మనవి. రెక్కాడ్తేనే కదా డొక్కాడ్తుంది. అట్టాంటప్పుడు యాడైతే మనకేం? యాడికి పొయ్‌నా రూపాయకు పదారణాలే కదా? అందుకే చెప్తా ఉండా. నీ తాత ముత్తాతల పేరు నిలబెట్టు" అని.

ముత్తడు తాత ముత్తాతల పేరు నిలబెట్టడమే కాదు - పేరు తెచ్చుకొన్నాడు.

"ఓయబ్బా! వాడా? ఆ ఇంటికెప్పుడో రుణపణ్ణాడు. పెండ్లీలే. పెటాకులూలే. రేత్రీలే. పొగులూలే. ఇల్లొదిల్తే కయ్య. కయ్యొదిల్తే ఇల్లు. వాడి పొసుగూల! యాడుండాదో వాడికా సెగితి. రాళ్లతో పోరకలాడ్తా ఉండాడబ్బా!"

ఆ ఊళ్లో ఏనోట విందామన్నా ఇదేమాట! ఊళ్లో వాళ్లు ఉత్తుత్త మాటల్తో ఉబ్బిస్తే పరదేసిరెడ్డి ప్రాణంలో ప్రాణంగానే మెలిగాడు.

ముందు మడక పట్టి అడుసు మడిలో పొద్దు నడిమిట్ట కెక్కేదాకా ముత్తడు మడక దున్నుతూనే ఉంటాడు. కూలివేళ దాటిపోతూ ఉందని వెనుక కూలి మడకలు ఏడుస్తూ ఉంటాయి. ఆ పోరు పడలేకుండా అప్పుడు ముత్తడు మడక విడిచిపెడ్తాడు. ఊరి ముందర గుంటలో ఎద్దుల్ని శుభ్రంగా కడుగుతాడు. గాటకట్టి సుతారించి మేపు వేస్తాడు. ఒక్క క్షణం పాలుమారి కూర్చోకుండా పార చేతికెత్తుకొంటాడు. వంచిన తల ఎత్తకుండా అంద కొడ్తా ఉంటాడు. పొద్దు నడిమిట్టన విరుచుకపడ్తూ ఉంటుంది. పరదేసిరెడ్డి పంచె పైకెత్తి పట్టి గెనిమల మీద రెడ్డి దర్పం దారిచూపుతూంటే వస్తూవస్తూ ముత్తణ్ణి చూసి నిలబడినట్లు నిలబడతాడు.

"ఒరే ముత్తా! నీకు చెప్పి చెప్పి నా నోరు పోవాల్సిందేరా? అయినా ఇప్పుడిక్కడ ఏం కొంపలంటక పోతా ఉండాయిరా? ఇయ్యారవదాకి మడక దున్నినావు గదా? ఒళ్లట్టా సుద్దంగా కడుక్కోని...కడుపుకంత కొట్టుకోని రొంతసేపు అట్లా వాలబడి మల్ల గావాలంటే

అండే కొడ్తావో? అడివి మింద బడి ఆకంతా తెచ్చి అడుసు మడికేసి తొక్కతావో? అప్పుడు నిన్ను వద్దనే ఎదవ ఎవుర్రా?"

చాలు మీద చాలు తోలి దున్నిన అడుసుకంటే మెత్తగా ఉంటాయి మాటలు!

అప్పుడు అడుసు మడిలో ఉన్నట్టు అనుకోడు ముత్తడు. పన్నీటి మడుగులో పడి తేలుతున్నట్లు మురిసిపోతాడు!

ముత్తడు ప్రతిదినం తొలికోడి కూతకు ముందే నిద్ర లేస్తాడు. కొట్టంలో ఎద్దుల్ని వీపు తట్టి లేపుతాడు. కుడితి చూపుతాడు. బానా మోకు, బండీ కదురుగోలు ఇరు భుజాలమీద పెట్టి ఎద్దుల పగ్గాలని చేతబట్టి బావిలో కపిల కట్టేదానికి బయలదేరుతూ ఉంటాడు. పరదేసిరెడ్డి ఇదంతా ఒక కంట గమనిస్తూనే ఉంటాడు. అయినా వాడు గడప దాటేటప్పుడు 'ఒరే ముత్తా!' అని మెత్తగా పిలుస్తాడు.

ముత్తడు ఒక్క క్షణం నిలబడతాడు.

"ఒరే యదవన్నర యదవా? నీకు నిద్ర పట్లేదని అందరికి నిద్ర పట్లేదనుకుంటే ఎట్లరా? ఈ యరవకాడ గంగాబవాని మంచి నిద్రమింద ఉంటిందిరా. అంత మంచి నిద్ర మిందుండే చల్లని తల్లికి నిద్రాబంగం జరిగితే కోపగించుకోదంట్రా?"

పక్వంగా పాచినోటి మాటలు!

"ఇన్ని దినాలు కోపగించుకోని గంగమ్మతల్లి ఈ పొద్దు మాత్రం కోపగించు కుంటిందా? ఒకమాట చెప్పినా ఒక పనిజేసినా సక్కరంగా ఉండాల. ఈయన కతంతా ఇచిత్రం పచ్చి పులుసు కతే" అని గొణుక్కుంటూ ముత్తడు బయలుదేరుతాడు.

"సరే!...పోరా పో!! చెప్తే చెవుల్లో ఏసుకుండే జన్మమైతే పరవాలే? ఒద్దంటే కద్దు అంటే ఎవరేం జేస్తారు?" అంటూ పరదేసిరెడ్డి నిట్టూరుస్తాడు - గుండెల్లో తృప్తి పెదాలమీద మొలచి చిరునవ్వు పువ్వై రేకులు విప్పుకొంటుంటే.

అటువంటి మనిషి ఎడంకాలితో ఎగిరి ఎదురొమ్ము మీద ఒక్క తన్ను తన్నాడు!

ముత్తడి కండ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. కానగ చెట్టు బోదెకు వాలపడ్డాడు. కండ్లు మూసుకున్నాడు. కనురెప్పలను చీల్చుకొని వచ్చిన కన్నీళ్లు చెంపలమింద జారి ఎదమీద పడ్తూ వాడి యజమాని అవిశ్వాసాన్ని అభిషేకిస్తున్నాయి. కరిగిపోయిన కాలం వాడిని కట్టెగా మిగిల్చి మనస్సులో ప్రాణం పోసుకొనింది!....

ఇదంతా ఒక ఎత్తైతే ఆరోజు జరిగింది మాత్రం ఎత్తుకు పై ఎత్తు. ఆరోజు గాంధీ మహాత్ముడు పుట్టిన రోజట. తాను కలలోగూడా ఊహించలేదు. ఇంటి ముందు ఊరంత పందిరి వేయించాడు. హైదరాబాదు నుండి మంత్రి గారిని పిలిపించాడు. పాయకట్టు పాయకట్టుగా పిలిపించి పందిరి కింద కూర్చోబెట్టాడు. పెనుమూరు నుండి పిచ్చయ్య శాస్త్రుల్ని, పిల్లయ్యోర్ని ఇద్దర్నీ పిలిపించాడు.

"ఇదంతా ఎందుకో? ఏమో? మనకెందుకులే?" అనుకుంటూ ఉంటే పెరట్లో

సలసలకాగుతున్న నీళ్లను చూపించాడు. తలంటుకోమన్నాడు. తలకడుక్కోమన్నాడు. మల్లెపువ్వును మరిపించే మంచి పంచను తెచ్చి కట్టుకోమన్నాడు. కట్టుకున్న తర్వాత సభ వద్దకు తీసుకొని వెళ్లి మంత్రి పక్కన 'కూర్చోరా' అన్నాడు. తాను వెనకా ముందాడుతుంటే 'కూర్చోరా!' అని గద్దించాడు. మింగలేక కక్కలేక మినుకుతూనే తాను కూర్చున్నాడు. అప్పుడు తన కొడుకు గాంధీరెడ్డిని దొర బిడ్డ మాదిర తయారుచేసి తన ప్రక్కన్నే కూర్చోబెట్టాడు. పాయకట్లో జనమంతా అయోమయంగా ఊపిరిబిగబట్టి చూస్తున్నారు. అప్పుడు పరదేసిరెడ్డి పైకి లేచాడు. గొంతు సవరించుకొన్నాడు.

"మహా జనులారా! ఈ దినం మనకు పండగ దినం. ఎందుకంటే? ఎక్కణ్ణో ఒక మూలగాని మూలలో ఉండే చిన్న పల్లె మనది. బస్సురావాలంటే కష్టం. బండి కదలాలంటే ఇబ్బంది. వీటన్నిటినీ లెక్క పెట్టుకోకుండా...లెక్కలేనన్ని పన్లు చేతులో ఉంటే వాటినట్లా పక్కనపెట్టి- మంత్రిగారు మన ఊరికొచ్చినారు అంటే అది మన బాగ్యం!" అంటూ పరదేసిరెడ్డి మంత్రిగారి మెడలో పూలదండ వేసి చేతులు తట్టేసరికి పందిరికింద జనమంతా 'పోలో' మని చేతులు తట్టారు!

పందిరి అమాంతంగా పైకి లేచిపోతుందేమో అనిపించింది.

పరదేసిరెడ్డి మళ్లా అందుకొన్నాడు!

"మహాజనులారా! మీకందరికీ తెలుసు ఈ పరదేసిరెడ్డి ఏ పని చేసినా చేయించినా పదిమంది మెచ్చుకునేటట్టు చేస్తాడని. అయితే ఇప్పుడు మీరంతా తెగ ఆచ్చర్య పడిపోతా ఉండారని నాకు తెలుసు. ఎందుకంటే? ముత్తడు నా ఇంట్లో సేద్దిగాడు. ఈ పాయకట్టు కంటికి వాడొక మాలోడు. అంతే! అంతకుమించి ఏమీ లేదు. అటుమంటోణ్ణి ఈ పొద్దు ఈ వేదిక మింద మంత్రిగారి పక్కన కూసోపెడ్తే-అప్పటికి ఈ పాయకట్లో నాయం బతికినట్టా? చచ్చినట్టా? ఇక మేమంతా ఈ పాయకట్లో ఎట్లా మొకమెత్తుకొని తిరగాల? అని మీరంతా ఆలోచిస్తా ఉండొచ్చు. కానీ... మహాజనులారా! నేను మనవి చేసేదేమంటే? గాందీ మహాత్ముడు ఏమి చెప్పినాడు? 'మాలోళ్లుగూడా మనుషులేరా! మనలో ఉండే రక్త మాంసాలే వాళ్లల్లో కూడా ఉండేదిరా!' అని చెప్పినాడా? లేదా? మీరే చెప్పండి. ఈ పొద్దు మన ఇందిరమ్మ ఏమంటా ఉండాది. అదే మాట అంటా ఉండాది. అవునా? కాదా? పెద్దోళ్ల మాటల్ను మనం పాటించినప్పుడే ఆ మాట్లకు గౌరవం. మనకు మంచి. ఇంతకూ నేను చెప్పేదేమంటే? ముత్తడి తాత ముత్తాతల తరం నుంచి నా పంచనే నమ్ముకొని బతికినారు. ముత్తడు వాళ్ల పేరు నిలబెట్టినాడు. వాడు నాఇంటి బిడ్డ. 'మంచి గుడ్డ కట్టుకోరా!' అంటే మట్టిలో పొల్లాడే వాణ్ణి నాకెందుకంటాడు. 'వేళ చూసి కడుపుకంత కూడు తినరా!' అంటే 'తినకుండానే బతకతా ఉండానా? పనిచేస్తా ఉండానా?' అంటా ఎదురు తిరగతాడు. 'పోనీ! పెళ్లి చేసుకోని నువ్వూ వొకింటోడివి కారా!' అంటే 'చేసుకున్నోళ్లంతా అనబవించే సుకం కనిపిస్తానే ఉండ్లా!' అంటా దీర్గాలు తీస్తాడు. ఇప్పుడు

వాడికి యాభై ఏండ్లకు పైబడింది. చెప్పిన మాటవినిపించుకొని పెండ్లి పెటాకులు చేసుకోని వాడూ ఒక ఇంటోడనిపించుకోని ఉంటే వాడు కద్దు. వాడి సంసారం కద్దు. ఇప్పుడు దీనికంతా అవసరం ఉండేది కాదు. వాడు పుట్టి బుద్దెరిగిన నాటి నుండి ప్రతి చెమటబొట్టు ఈ ఇంటికి దారపోసినాడు. ఇటుమంటోళ్లు ఏ నూటికో కోటికో ఒక్కడు ఉండేది దుర్లబం. వాడికి కడుపులో పండ్లు లేవు. పాలుమాలిక ఒంటిమింద లేదు. నేనా? పొద్దు వాలిపొయ్యింది. ఈ పొద్దో రేపో? ఎవురు చూసినారు. నా తదనందరం ఈడు బాదపడరాదు. కాలూ చెయ్యి ఉడిగిన కాలాన చూసేదిక్కులేక దిగులుపడరాదు. అందుకే వాడి ఋణం తీర్చుకునే దానికి నాకు ఒక్కటే ఒక మార్గం తోచించి."

గుండెలనిండా గాలి పీల్చుకుంటూ పరదేసిరెడ్డి నిమీలిత నేత్రాలతో ఒక్క నిముషం మౌనం వహించాడు. పందిరి కింద జనం ఊపిరి బిగపట్టి కంటిమీద రెప్ప పడకుండా చూస్తున్నారు.

"నా పెద్ద కొడుకు గాందీరెడ్డిని ముత్తడికి దత్తత చేస్తున్నాను."

పరదేసిరెడ్డి నోట్లో మాట నోట్లో ఉండగానే మంత్రిగారే చేతులు తట్టేసరికి గొర్రైదాటు చప్పట్లతో మిన్ను విరిగి మీద పడుతుందేమో? అనిపించింది.

పెనుమూరు పిచ్చయ్య శాస్త్రి, పిల్లయ్యోరు ఇద్దరు చదివిన మంత్రాల్నే తిప్పించి మల్లించి తెగ చదువుచున్నారు. అప్పుడు పరదేసిరెడ్డి -

"ఆకాశవాణి సాక్షిగా....భూదేవి సాక్షిగా ఏడుగురు అక్కదేవతల సాక్షిగా గాందీరెడ్డి ముత్తడి దత్తు కొడుకు!" అంటూ గాంధీరెడ్డి చేతుల్ని ముత్తడి చేతుల్లో పెట్టాడు.

మరలా ఒకసారి మంత్రిగారు చేతులు తట్టేకుందికి పాయకట్టు పరవశించి తట్టింది.

మంత్రిగారు పరదేసిరెడ్డి ఔదార్యానికి హద్దు ఆకాశమే అని చెప్పడానికి మాటలు వెదుక్కుంటూ ఉంటే గాంధీరెడ్డి వంగి ముత్తడికి నమస్కరించాడు.

మళ్ళీ ఒకసారి సభ చప్పట్లతో మారు మోగింది!...

"మణిసి అంటే పర్దేసిరెడ్డేరా మణిసి! బండ చాకిరీ చెయ్యించు కున్నెంత కాలం చెయ్యించు కున్నాడు. ఆ చాకిరికి తగినట్లుగా కొడుకునే దత్తుకిచ్చేసినాడు. మణిసి అంటే అట్లుండాల. అయినా ఆ మొనగాడు చేసే పనులకు ఏలెత్తి చూపించేదానికి ఎవుడి వల్ల అవుతుందిలే."

"ఒరే అబ్బోడా! నువ్వు చెప్తా ఉండేది ఇనే దానికి శానా బాగుండాదిరా. నీకు తెలవదనిగాదు పెద పెద్దోళ్లు చేస్తే పెరుమాళ్లు చేసినట్టు? అదే నువ్వో నేనూ చేసుంటేనా ఎంతమంది దుమ్మెత్తిపోసే వాళ్లో? మన నెత్తిమింద"

ఒక ముసలాయన సణుగుడు.

"ఎంత దుమ్మెత్తి పోసినా ఆ బట్ట తలకాయిమింద నిలబడదులేరా ముసిలోడా! నడిమద్దె నువ్వెందుకు దున్నపోతు దున్ని చస్తే పిడుదు మాదిర వగిరిస్తావ్?"

ముసలాయన మీద ఒక కుర్రవాడి విసుర్లు!

"పర్దేసిరెడ్డేమీ పిలగాడు గాదు. ఆ మొగలాయి ఏం చేసినా దాని ఎనకాల ఎంతో కత ఉంటాది. మనం ఇట్లా ఉర్దాగా మాట్లాడుకుండేది కుక్కల కాట్లాటే!"

పుర్రెకొక బుద్ధి అన్నట్లుగా ఆ ఊళ్లో ఎవడికి తోచినట్లు వాడు మాట్లాడుతున్నాడు. ముత్తడి గుండెల్లో గాంధీరెడ్డికి తానే అయ్యనన్న అభిప్రాయం గుండె స్వాతి చిప్పలో చినుకయ్యింది. ముత్యంలా రూపు దిద్దుకుంటూ ఉంది. అయినా వాడు చాలా గుంభనంగా తిరుగుతున్నాడు. నెలతిరగక ముందే గాంధీరెడ్డి పై చదువులకని ఢిల్లీకి ప్రయాణం కట్టాడు.

నాగులమిట్ట బావి గట్టున కానుగచెట్టు ఒకసారి ఆకురాల్చి పూతపూసింది. పంటలు వొబ్బిడయ్యాయి. ఒకరోజు మధ్యాహ్నం భోజనానంతరం పరదేసిరెడ్డి వసారాలో వాలు కుర్చీలో కునుకు తీస్తున్నాడు. ముత్తడు ఆయన ముందు నిలబడ్డాడు. లేపాలా? వద్దా? అన్న సందేహంలో పడి తల గీరుకున్నాడు. 'వద్దులే' అనుకున్నాడు. కానీ కాలు కదలలేదు. రెండు మూడు నాళ్లుగా వాడు కడుపులో దాచుకున్న మాట ఇక అక్కడ ఉండలేనన్నట్టుగా పొడి దగ్గుగా మారింది. కాకి నిద్రను చెడగొట్టడానికి పొడిదగ్గే సరిపోయింది. పరదేసిరెడ్డి కండ్లు తెరిచాడు. ఆ వేళప్పుడు ఎదుట నిలబడిన ముత్తడిని ఆశ్చర్యంగా చూస్తూ -

"ఏమిరా ముత్తా?"

"ఏమీ లేదయ్యా?...అప్పుడెప్పుడో మాకూ బూములిస్తా ఉండారని ఒక ఐదెకరాలు నా మింద పట్టా చేసి పెడ్తిరి గదా?"

"అవును"

"ఎవుడి బతుకేమి శాశ్వితం? ఉన్నెట్టుండి పోనే పోతే...అప్పుడు లేని పోని బెడదలు. ఎందుకొచ్చిన పీకులాట? ఆ ఐదెకరాలు అబ్బయ్య పేర రాసి పెట్టెయ్యండి. నా సొత్తు నా తదనంతరమైనా అబ్బయ్యకే గదా చెందాల?"

ఇల్లెగిరి పొయ్యేటట్లు విరగబడి నవ్వాడు పరదేసిరెడ్డి. నవ్వుతూ ఉంటే పొల మారింది. పొలమారేకుందికి దగ్గు. వాలుకుర్చీ ప్రక్కన్నే చేతివాటంగా చెంబులో నీళ్లు. ఎత్తుకొని రెండు గుక్కలు తాగాడు. తెపరాయించుకొని చెంబు ప్రక్కన పెడ్తూ-

"ఒరే నీకేమన్నా పిచ్చీ గిచ్చి పట్టిందా?లేకుండాబోతే ఏందిరా నీపాడు కూతలు?... అయినా ఇప్పుడిక్కడ ఏమి ఆరకపోతా ఉండాదని అంత పని చెయ్యాల?...అది గాదురా! కయ్య పక్కన కయ్య. చేస్తా ఉండేది నువ్వే. తెచ్చి ఇంట్లో పోస్తా ఉండేదీ నువ్వే. అట్లాంటప్పుడు ఎవుడి పేరుతో వుంటే ఏమయిందిరా? ఊఁ! ...చెప్తే ఇనిపించుకునే జల్మమైతే పరవాలే. అట్నేలేరా! కాదని నీమణుసును బాద పెట్టేదెందుకు? అన్నీ జరిగినట్టు ఇదీ నీ ఇష్ట పకారమే జరగనీ!..."

ఐదెకరాల బంగారు పండే భూమి. వారాలు తిరగక ముందే అబ్బయ్య పేర

రిజిస్టరైపోయింది!...నాగులమిట్ట బావి గట్టున కానగచెట్టు ఎన్నిసార్లు ఆకురాల్చి పూత పూసిందో ముత్తడు గమనించనే లేదు. గాంధీరెడ్డి కలెక్టరు హోదాలో ఊళ్లో అడుగు పెట్టాడు! గుండె గుండె ఆనందాన్ని పులుముకుంటే-ఆ పాయకట్టు నృత్యం చేసింది.

ముత్తడు ముత్తన్న అయ్యాడు!

"ముత్తన్నా! ఇంక నీకేమన్నా?...ఈ లోకంలో కష్టానికి తగిన పల్తిం దక్కేది దుర్లబం అంటారు. అయినా నీకు దక్కింది. నీకొడుకు కలేకట్రు. ఇంక ఈ బురదపిసుక్కుండే పని నీకెందుకు? ఇంక ఈపల్లె కొంపల్తో నీకేంపని? కలేకట్రు బంగాళాలో దొరమాదిర్తో...కాలు మింద కాలేసుకొని...అన్నా!అన్నా! అదట్టా ఉణ్ణీ! ఎప్పుడన్నా ఏదన్నా పని పాటా పడి కలేకట్రు దొరతావు కొస్తే మర్సిపోకుండా ఒక్క మాటట్టా పలకరించన్నా!"

ఆ ఊళ్లో ఎప్పుడు ఎక్కడ ఎవరు ఎదురు పడినా ఇదే మాట!

ఆ మాటలు చెవుల్లో పడుతుంటే వాడి గుండె పూచిన కంది చెట్టే అయ్యేది.

గాంధీరెడ్డి తిరుగు ప్రయాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రేపో మాపో బయలుదేరుతున్నాడు. ఈ సంగతి అదోక పెద్ద వార్తగా పాయకట్లో ప్రాకింది. కలిగిన వాళ్లు...పరదేసిరెడ్డికి బంధువులు కావలసిన వాళ్లు వస్తున్నారు. పూలమాలలు వేస్తున్నారు. కౌగలించుకొంటున్నారు. కరచాలనం చేస్తున్నారు. 'పుట్టిన గెడ్డకే పేర్దెచ్చినావయ్యా!' అని అభినందిస్తున్నారు. ఇదంతా కండ్లారా చూస్తున్న ముత్తడి గుండెల్లో తట్టుకోలేని తపన తానూ తన బిడ్డను ఒక్కసారి తనివిదీరా కౌగలించుకోవాలని!

ఆ మాట మనసులో మెదిలేసరికి వెన్నెముకలో చలి పుట్టింది. గుండె దడ హెచ్చింది. సన్నగా వణుకు మొదలయ్యింది. ఎటూ పాలుపోకుండా గాంధీరెడ్డిని ఒక కంట గమనిస్తూనే అటు ఇటూ తిరుగుతున్నాడు. తిరుగుతూ ఆలోచించాడు.

"అవును. నేను అయ్య. గాందీరెడ్డి నాకు బిడ్డ. వాడు ఎటుమంటి ఇక్లామార్కుడైనా ఢిల్లీకి రాజైనా తండ్రికి బిడ్డే కదా?"

ముత్తడికి కొంత నిబ్బరం దొరికింది. ఆ నిబ్బరంతో స్థిరంగా నిలబడ్డాడు. నిలబడి గాంధీరెడ్డిని తదేకంగా చూస్తున్నాడు. అలా చూస్తూ చూస్తూ ఉండగానే వాడి మనస్సు గతంలోకి గాంధీపుట్టినరోజు పందిరి కిందికి వెళ్లిపోయింది.

"పాయకట్టు పాయకట్టుగా పందిరి కింద...మంత్రి ఎదురుగా...ఆకాశవేణి సాచ్చిగా...బూదేవిసాచ్చిగా...ఏడుగురు అక్క దేవతల సాచ్చిగా...'గాందీరెడ్డి ముత్తడి కొడుకు' అంటా పర్దేసిరెడ్డి గాందీరెడ్డి చేతుల్ని తన చేతికి పట్టిచ్చినాడు గదా?"

ఈ దృశ్యం కండ్లముందు మెదిలే సరికి ముత్తడికి ఎక్కడలేని తెంపు పుట్టుకొచ్చింది. ఒక్కమోపున ఇంట్లో జొరబడ్డాడు. గాంధీరెడ్డిని అమాంతంగా కౌగలించుకొన్నాడు.

పరదేసిరెడ్డి తోక త్రొక్కిన త్రాచే అయ్యాడు!

ఎగిరి ఒక్క తన్ను తన్నాడు!

ఎవరితోచెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? మొగమెత్తుకొని ఎలాతిరగాలి? ఇక ఎందుకీ బ్రతుకు బ్రతకాలి?

కానుగచెట్టు బోదెకానుకొని కన్జీగటి పడేదాకా ముత్తడు తనలో తాను ఇలా కుములుతూనే ఉన్నాడు!

భవిష్యత్తు పెద్ద ప్రశ్నార్థకభూతమై సవాలు చేస్తూనే ఉంది. ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. ఇక పరదేసిరెడ్డి గడపలో కాలు పెట్టలేడు. అలా అని ఆ పాయకట్లో మరొక పని చేస్తూ తలెత్తుకొని తిరగలేడు. అర చేతిలో వున్నది ఐదెకరాల నేలను చేజేతులా ధారపోసుకొన్నాడు.

ఇప్పుడు ఏం చేయాలి?

అటూ ఇటూ చూశాడు. ఆ బావి గట్టున బారెడు దూరంలో తీగ్రపాద. చివాలున లేచాడు. రెండు తీగలు గుంజుకున్నాడు. ఆకు దుసేశాడు. కన్జీగటి పడుతున్నవేళ. ఆ ప్రాంతంలో పురుగు మెదలడంలేదు. గబాలున గొంతు కూర్చున్నాడు. ఒక తీగతో రెండు కాళ్లూ చేర్చి బిగువుగా కట్టాడు. ఇంకొక తీగ కొనను ఒక చేత్తో మరొక కొనను నోటితో పట్టుకొన్నాడు. తీగను గిరగిరా తిప్పుతూ రెండు చేతుల్ని గట్టిగా ముడేసుకున్నాడు. చేతుల్ని అలానే పైకెత్తి ఊరివైపు చూస్తూ ఒక్కదణ్ణం పెట్టాడు. అంతటితో తనకు నూకలు చెల్లి పోయినట్లుగా గుండె దిటవు చేసుకున్నాడు. గట్టుమీద నుండి బావిలోకి అలానే దొర్లిపోయాడు!

కలెక్టరు గాంధీరెడ్డి ఆ మరుసటి రోజు ఉదయమే బయలుదేరి వెళ్లాడు.

గంగాభవాని ముత్తడిని మూన్నాళ్లు కడుపులో భద్రంగా దాచుకొనింది. ఆ తరువాత దాచుకోవడానికి ఇష్టమే లేకపోయిందో? లేదు ముత్తడు చాలా గొప్పవాడని లోకానికి చాటాలనుకొనిందో పైకి నెట్టేసింది!

నాగులమిట్ట బావిలో ముత్తడు శవమై తేలుతున్నాడు! ఎవరి కంట పడిందో ఏమో?' అయ్యోపాపం! ముత్తడు బావిలో పడి చచ్చిపొయ్‌నాడు!...ముత్తడు బావిలో పడి చచ్చిపొయ్‌నాడు!...అన్న వార్త క్షణాలమీద ఆ పాయకట్టంతా ప్రాకి పోయింది. జనం పాయలు పాయలు వస్తున్నారు. జరగరాని వింత ఏదో జరిగినట్టు బావి చుట్టూ చేరి ముత్తడి శవాన్ని చూస్తున్నారు. పరదేసిరెడ్డి బావి చుట్టూ తిరుగుతూ 'బొరో!' మని ఏడుస్తున్నాడు. బావి చుట్టూ చేరిన వాళ్లల్లో వేడుక చూసే వాళ్లు కొందరైతే ఎగచీదే వాళ్లు కొందరుగా ఉన్నారు.

పదిమందిలో పడ్డ పామైనా తప్పించుకుంటిందేమో కానీ పదిమంది కంట పడ్డ శవం అనాథ ప్రేతంగా మిగలడానికి అవకాశం లేదు ఈ దేశంలో!

బండి కట్టె!...డబ్బా కిరసనాయిలు!!

ముత్తడి కట్టె కట్టెల్తో చేరి బూడిదగా మారి మట్టిలో కలిసి భారంగా నిట్టూర్చింది-

కృతఘ్నుడైన మనిషిని చూస్తూ!

చీకట్లో కలిసిపోయిన ముత్తడికి సానుభూతి చూపుతున్నట్లుగా కాలగమనంలో చంద్రుడు మాయమై లోకాన్ని చీకట్లో ముంచాడు. 'అయ్యో!' మని అలమటించింది లోకం. ఆ ఆవేదనను అర్థంచేసుకొన్నట్లుగా ఒక్కొక్క వన్నెగా పెరుగుతూ ఆనాడు పూర్ణాకృతితో లోకానికి కనువిందు చేశాడు చంద్రుడు.

కలెక్టరు గాంధీరెడ్డి తన ఇంటి ముందు కార్లో నుంచి దిగాడు!!

ఒకప్పుడు ఆ ఊరికి బస్సురావడానికి కష్టంగా బండి కదలడానికి ఇబ్బందిగా ఉండేది. అయితే ఇప్పుడది సాక్షాత్తూ కలెక్టరుగారి ఊరు. తాను రావడానికి సౌకర్యంగా పలుకుబడితో తారురోడ్డు వేయించుకున్నాడు. 'ఊళ్లో పుట్టినందుకు ఊరికి తారు రోడ్డు ఎయ్‌పించి పున్నెం గట్టుకున్నాడు!' అన్న మంచి పేరు తెచ్చుకొన్నాడు గాంధీరెడ్డి!

గాంధీరెడ్డి వచ్చీ రావటంతోనే మళ్లీ ఇంటి ముందర ఊరంత పందిరి వేయించాడు. ఆ పందిరి కింద చాపలూ దుప్పట్లూ పరిపించాడు. ఒక మేజా వేయించి దాని మీద మూడడుగుల ఎత్తుగల ముత్తడి ఫోటోను పెట్టించాడు. ఆ ఫోటోను పూలమాలల్తో అలంకరించాడు. పక్కనే దీప స్తంభం పెట్టి ఒక్క సారిగా నాలుగు వత్తుల్ని వెలిగించాడు. అగరువొత్తుల పరిమళాల మత్తు సభాసదులను సన్మానిస్తూ ఉంది!

మేజాకు ఒకపక్క గాంధీరెడ్డి. ఇంకొక పక్క పరదేసిరెడ్డి పందిరి కింద పరిచిన దుప్పటి మీదనే కూర్చున్నారు.

కలెక్టరే నేలమీద కూర్చునే సరికి ఊళ్లోవాళ్ల ఆశ్చర్యానికి హద్దులేదు. ఏం జరుగుతుందో? అని ఆశ్చర్యంగా చూస్తున్నారు. అప్పుడు గాంధీరెడ్డి పైకి లేచాడు. ఒక్క సారి ఊళ్లో వాళ్లందర్నీ పరిశీలనగా చూశాడు. ఆ తరువాత ముత్తడి చిత్రపటం వైపు తిరిగి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు!

ఊళ్లో వాళ్లందరూ గాంధీరెడ్డికి చేతులెత్తి నమస్కరించారు.

గాంధీరెడ్డి వదనంలో విచార రేఖలు సూటిగా వెళ్లి సభలో ప్రతి చూపునూ తాకి ప్రతి గుండెనూ పరామర్శిస్తున్నాయి ఆర్ద్రంగా. వాళ్ల ముఖాలు రంగులు మారుతున్నాయి. గాంధీరెడ్డి గొంతు సవరించుకొన్నాడు.

"నేనిప్పుడు కలెక్టరు కావచ్చు. ఇంకేమైనా కావచ్చు. కానీ నేను ఇక్కడే మీ కండ్ల ముందరే పుట్టిన వాణ్ణి. ఈనేలమీదనే ఆడుకున్న వాణ్ణి. ఇక్కడే ఈమట్టి వాసనల్తో పెరిగిన వాణ్ణి. ఢిల్లీకి పాదుషా అయినా తల్లికి బిడ్డేగదా? మీ అందరి సమక్షంలోనే మానాన్న నన్ను ముత్తయ్యకు దత్తత చేశాడు. ఒక గొప్ప అభ్యుదయవాదిగా ఆయన త్యాగమూర్తి అనిపించుకున్నాడే కానీ ఆయనే కాదు మీరు కూడా నామాట మరిచిపోయారు. దత్తు కొడుకుగా నా కర్తవ్యాన్ని నేను నెరవేర్చలేకపోయాను. ఎంత దారుణం. మీరు నాకు ఆ అవకాశాన్ని ఇవ్వలేకపోయారు. నా కన్న తండ్రి! ఆయన బాధ ఆయనది. కుడి భుజమే

విరిగిపోతే ఏ వ్యక్తికైనా ముందువెనుకలు ఆలోచించుకునే మనస్థిమితం ఎలా ఉంటుంది? ముత్తయ్య నాదత్తు తండ్రి. ఈ ఇంటికి చేసిన సేవ మీకందరికీ తెలుసు. అటువంటి త్యాగమూర్తిని కోల్పోయిన నా కన్న తండ్రి పరిస్థితిని కండ్లారా చూస్తూ కూడా మీరంతా ఏమైనట్లు? కాకితో కబురంపితే రెక్కలు గట్టుకుని వచ్చి వాలేవాణ్ణి. నాదత్తు తండ్రి దహన సంస్కారాలు కర్మక్రియలు నా చేజేతులా జరిపించి ఉంటే ఆయన ఆత్మ ఎంతో శాంతించేది. ఇప్పుడు మీరే చెప్పండి? ఆయన ఆత్మ శాంతిస్తుందా? ఈ కృతఘ్నుణ్ణి క్షమిస్తుందా?"

ఆపైన మాటలు రానట్లు వలవలా ఏడ్చాడు కలెక్టర్ గాంధీరెడ్డి!

"అయ్యయ్యో! అవునుగదా, పాపం! ఎంత పొరపాటు జరిగిపొయ్యింది. ఎంత పొరపాటు జరిగిపొయ్యింది." అని తెగ బాధపడి పోతున్నారు పందిరి క్రింద జనం!

ఏడుస్తూ ఉన్న కొడుకును చూసి ఏడుస్తూ పైకిలేచాడు పరదేసిరెడ్డి!

"ఒరే నాయానా! ముత్తడు శానా గొప్పోడురా!...శానా గొప్పోడురా! ఇప్పుడు వాడి ఆత్మ మన చుట్టూ తిరగతానే ఉంటింది కదరా. నువ్వు పడ్తున్న కాకి శోకం వాడి చెవుల్లో తప్పక పడ్తిందిరా. నువ్వు పడే పచ్చాత్తాపంతో వాడి ఆత్మ శాంతిస్తుందిరా! తప్పక శాంతిస్తుంది. ముత్తడు గొప్పోడురా! గొప్పోడు!"

నటన జీవితంలో ఒక భాగమే! కానీ జీవితమే నటన అయితే ముత్తడిలాంటి అమాయకులు గొప్పోళ్లు కాక ఇంకేమవుతారు?●

*-ఆంధ్రజ్యోతి (11.3.1983)*